# సింగిల్ పేజీ కథలు

## కవి సన్మానం

**రాజేశ్వరరావు పోస్టు చూస్తూ ఒక్క గావుకేక పెట్టాడు. "సావిత్రీ"**

**వంటింట్లోంచి పరుగెట్టినట్లు వచ్చింది సావిత్రి, చెంగుతో చెయ్యి తుడుచుకుంటూ..."ఏంటండీ, అంత కేక పెట్టారు?" అంది.**

"ఇంతకాలానికి నా కవిత్వానికో గుర్తింపు వచ్చింది. ఇదిగో ఈ ఉత్తరం చూడు" సావిత్రికి ఉత్తరాన్నందించాడు, వెలిగిపోతున్న ముఖంతో.

"స్రవంతి కవి శ్రీ రాజేశ్వరరావుగారికి నమస్కారాలు.

జిల్లాకు ఇద్దరు చొప్పున రాష్ట్రంలో మొత్తం 50 మందికి-మీలాంటి గొప్పకవులకు, మా సంస్థ ఆధ్వర్యంలో వచ్చే ఆగస్టు 15న, హైదరాబాదు రవీంద్రభారతిలో సన్మానం- విశిష్ట కవి సన్మానం చేయాలనుకుంటున్నాం. అదీ మన విద్యామంత్రిగారి అమృతహస్తాలతో. రానూపోనూ ఖర్చులూ ఆనాటి వసతి భోజన సౌకర్యాలతో మా ఖర్చుపై. దీనికి మీ అంగీకారాన్ని తెలియజేయవలసిందిగా ప్రార్థిస్తున్నాం

-మునీర్, అధ్యక్షులు, కల్చరల్ అకాడమీ, జగిత్యాల"

ఉత్తరం చదివి సావిత్రి తిరిగిచ్చేసింది. ఏ రకమైన స్పందనా లేదు.

"అదేంటి, ఒక్క మాటా మంతీ లేదు?"

"ఇందులో చెప్పడానికేం ఉందని?"

"కవి సన్మానం, గుజా- అదీ రవీంద్రభారతిలో..!"

"నల్లెండి, నాకు చాలా పనుంది" అంటూ వెళ్లిపోయింది.

ఈ భార్యలెప్పుడూ ఇంతే. భర్తల కవితా ప్రతిభని లోకమంతా గుర్తించినా వీళ్లకది కన్పించదు. ఉత్సాహం కొంత తగ్గింది.

* * *

వారం రోజులకు ఫోన్ మోగింది.

"నమస్కారం, రాజేశ్వరరావుగారూ, మునీర్‌ని, జగిత్యాల నుండి.."


"నా అంగీకారం ఉత్తరం అందిందా?"

"అందింది సార్..చాలా ధన్యవాదాలు. మీ సన్మానం సందర్భంలో ఒక సావనీర్‌ని తీసుకుని వద్దామనుకుంటున్నాం. 50 మంది సన్మానితుల ఫోటోలు, బయోడేటా-కవితా పరంగా. అందువలన మీ బయోడేటా- మీ కవితా వ్యాసంగం, రాసిన పుస్తకాలు, రెండు ఫోటోలు, పాస్‌పోర్టు సైజువి 'స్రవంతి' కవితా సంకలనం రెండు కాపీలు-పంపించండి"

"అలాగే ఈరోజే పంపుతాను.."

"అవి పంపుతూ సావనీరు ఖర్చు కోసం రు.500/- పంపాలి సార్"

"అయిదు వందలా? నాక్కొంచెం కష్టం"



"అవును సార్..పోనీ 300 పంపించండి..ఎం.ఓ. ద్వారా"

"సరే 300 పంపుతున్నాను. పై వివరాలతోపాటు.."

ఫోన్ కట్టయింది. సావిత్రి అందుకుంది.

"ఏంటండీ 300 పంపుతున్నానంటున్నారు. ఎవరికి? ఈ నెల పాలవాడికే బాకీ పెట్టారు. ఇదెట్లా?"

"అదేలే, ఆ సన్మానం చేస్తానన్న వాళ్లకి. సావనీర్‌లో మన గురించి రాస్తారట. ఫోటోలతో సహా.."

సావిత్రి చిరాగ్గా ముఖం పెట్టి వెళ్లిపోయింది. కష్టమైనా తప్పదు మరి. మునీర్ పంపమన్నట్టుగా ఆరోజే పంపేడు ఎం.ఓ.తో సహా.

* * *

ఆగస్టు 10వ తారీఖు వచ్చినా జగిత్యాల నుండి ఆహ్వానపత్రం రాలేదు. ఫోన్ చేద్దామంటే వాళ్ల ఫోన్ నెంబరు లేదు. ఆ ఎడ్రసుకి ఒక టెలిగ్రాం కొట్టాడు. ట్రయిన్‌కి రిజర్వేషన్ చేయించుకోవాలి కదా మరి. ఆగస్టు 14వ తేదీకి ఒక కార్డు వచ్చింది.

"శ్రీ రాజేశ్వరరావుగారికి నమస్తే-

సడెన్‌గా మా నాన్నగారు కాలం చేసారు. అందువలన ఆగస్టు 15 కార్యక్రమం అక్టోబరు 2కి వాయిదా పడింది. గమనించగలరు"

చాలా నిరుత్సాహ పడ్డాడు. సావిత్రి విజృంభించింది.

"నాకు ముందే అనుమానం కలిగింది. రానూపోనూ ఖర్చులిచ్చి హైదరాబాదులో భోజన వసతి సౌకర్యాలు కల్పించేవాళ్లకి సావనీర్ కోసం మీ దగ్గర 500 అడగటం దేనికి, అని"

"ఏదో వాళ్ల నాన్న పోయేడట, వాళ్లేం చేస్తారు మరి?" బింకం సడలకుండా ముఖం తిప్పుకున్నాడు.

* * *

అక్టోబరు రెండు, నవంబరు 14 గడిచిపోయాయి.

చాలా కోప మొచ్చింది రాజేశ్వరరావుకి, దొంగని తేలు కుట్టినట్లు ఊరుకోక తప్పలేదు.

ఈ సంవత్సరం రాజేశ్వరరావు రచన 'తమసోమా జ్యోతిర్గమయ' అనే మరో కవితా సంకలనం ప్రచురించేడు. వివిధ పత్రికల్లో దానిపై సమీక్షలొచ్చాయి.

మరల జగిత్యాల, మునీర్ నుండి మరో ఉత్తరం. తేదీ వేరు కాని 'మోడస్ ఆపరండి' అదే! బయోడేటా, ఫోటోలు, ఎం.ఓ..ఈసారి 'సన్మానం' సుందరయ్య భవనంలో!

సమాధానం రాశాడు రాజేశ్వరరావు. "శ్రీమునీర్‌గారికి..మీరు కోరినట్టుగానే ఫోటోలు, బయోడేటా, డబ్బు సిద్ధం చేశాను. రేపు ఆదివారం నేను నా ఫ్రెండు దగ్గరకు కరీంనగర్ వెళ్లవలసి ఉంది. ఫలానా టైముకి మీరు జగిత్యాల బస్టాండుకు వస్తే ఈ మెటీరియల్, డబ్బూ స్వయంగా అందజేస్తాను. మీ గుర్తింపును సూచిస్తూ ఒక ప్లేకార్డును చేత్తో పట్టుకోండి"

ఉత్తరంలో రాసిన టైముకి జగిత్యాల బస్టాండులో దిగాడు రాజేశ్వరరావు. మునీర్ ప్లేకార్డుతో రెడీగా ఉన్నాడు. అదే టైముకి అక్కడే పని చేస్తున్న తన ఫ్రెండ్ ఎస్.ఐ.మోహన్ మఫ్టీలో వచ్చేడు. రాజేశ్వరరావు డబ్బు ఇస్తున్నప్పుడు మోహన్ వాడిని రెడ్ హేండెడ్‌గా పట్టుకున్నాడు. జీప్ ఎక్కి ముగ్గురూ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లారు. స్టేషన్‌లో మునీర్ కాళ్లమీద పడ్డాడు.

"నేను చాలా బీదవాడిని. యం.కామ్ చదువుతు

న్నాను. మా తండ్రి లేడు. కుటుంబం గడవడానికి, చదువు ఖర్చు కోసం అని ముందుగా ఈ ప్రయోగం చేపట్టాను. డబ్బు చాలా వసూలయింది. ఇక చదువు మానేసి ఈ వృత్తిలోకి దిగేను"

"నా గురించి నీకెలా తెలిసింది?"

"పత్రికల్లో గ్రంథస్వీకారం, సమీక్షల్లో మీ పుస్తకాల గురించి, మీ చిరునామా వివరాలు తెలుస్తాయి. నన్ను క్షమించండి సార్" మోహన్‌రావు గద్దించేసరికి మునీర్ గట్టిగా ఏడ్చేశాడు..

"గత సంవత్సరం మీరు పంపిన 300 రూపాయిలు ఇవిగో సార్. నేను అందుకున్న డబ్బును పంపిన వారందరికీ ఈరోజే ఎం.ఓ చేసి ఎస్.ఐగారికి చూపిస్తాను..ఇంకెప్పుడూ ఇటువంటి పనులు చేయను"

మోహన్ రాజేశ్వరరావు వైపు తిరిగి "ఇంత చదువుకున్నావు. కవివి. మా సిస్టర్ సావిత్రి పాటి విచక్షణ తెలియలేదేంరా నీకు?".


తలొంచుకున్నాడు రాజేశ్వరరావు.

**-కొట్టి రామారావు(మచిలీపట్నం)**

# మనశ్శాంతి

**రంగనాథరావు బజార్లో అన్ని పనులూ చూసుకుని, చివరగా కిరాణాషాపుకి వెళ్ళేడు.**

**"నమస్తేసార్! రండి! కూర్చోండి" చిరునవ్వుతో ఆహ్వానించేడు షాపు యజమాని.**



తను గత పది సంవత్సరాలుగా ఇదే షాపులో నెలకి సరిపడ సరుకులు తీసుకువెళ్ళడం అలవాటైపోయింది రంగనాథరావుకి. సరుకు కాస్త నాణ్యంగా వుండడంతోపాటు రేట్లు కాస్త చౌకగా వుండడంతో ఈ షాపునే ఖరారు చేసేసాడు. "తొందరగా కట్టిస్తారా? నాకు కొంచెం అర్జంటు పనుంది యింటి దగ్గర" స్టూలు మీద కూర్చుంటూ అడిగేడు రంగనాథరావు.

"ఓ తప్పకుండా సార్! ఒరే ఈ సరుకులు తొందరగా కట్టండి" ఆజ్ఞాపించేడు షాపులో కుర్రాళ్ళని.

"సార్! టీ త్రాగుతారా?" మర్యాదకి అడిగేడు షాపు యజమాని రాజయ్య.

"లేదండీ ఇప్పుడే త్రాగి వస్తున్నాను!" నవ్వుతూ సమాధానమిచ్చేడు రంగనాథరావు. ఒక అరగంటలో సరుకులన్నీ రెడీ అయిపోయాయి.

"ఆ! ఎంతయిందో చెబుతారా!" లేచి నిలబడి అడిగేడు రంగనాథరావు. "సార్ మొత్తం ఎనిమిది వందల ఇరవై రూపాయిలయింది" చెప్పాడు రాజయ్య.

"క్రిందటి నెలకన్నా వంద రూపాయిలెక్కువయిందే! అవే సరుకులు" నవ్వుతూ అన్నాడు రంగనాథరావు.

"అన్నీ రేట్లు పెరిగిపోయాయి కదండీ! ఏం చేస్తాం?" సమాధానమిచ్చేడు రాజయ్య.

డబ్బు లెక్కపెట్టి, రాజయ్యకిచ్చేసి రిక్షా కోసం రోడ్డు మీదకు వచ్చేడు. అటే పోతున్న ఒక రిక్షావాడు "సార్! రమ్మన్నారా" అడిగేడు.

"గాంధీనగర్ పార్కు ప్రక్క వీధికి వస్తావా? అదిగో అక్కడ సరుకులున్నాయి" చెప్పాడు రంగనాథరావు.

"పదిహేను రూపాయిలిప్పించండి" అడిగేడు రిక్షావాడు.

"పదిహేనా? పదిస్తాను. మామూలు రేటే! వస్తే రా!"

"సరే! పన్నెండివ్వండి సార్!" అడిగేడు రిక్షావాడు.

"లేదు! పదికన్న ఇవ్వను నీ ఇష్టం"

"సరే రండి!" సరుకులన్నీ రిక్షాలో పెట్టేడు. పావుగంటలో పార్కు దగ్గరకి తీసుకుపోయి, రంగనాథరావు ఇంటికి తీసుకు వెళ్ళి సరుకులన్నీ ఇంట్లో పెట్టేసేడు. రంగనాథరావు జేబులోంచి పదినోటు తీసి ఇచ్చేడు.

"ఏంటి సార్! పదిచ్చేరు?" కోపంగా అడిగేడు రిక్షావాడు.

"పదికేగా నువ్వు ఒప్పుకున్నది!" ఆశ్చర్యంగా అడిగేడు రంగనాథరావు.

"అదేంటి సార్, పదంటే, నేను పన్నెండు రూపాయిలడిగితే, సరే రా! అన్నారుగా!" దబాయించేడు రిక్షావాడు.

రంగనాథరావు కోపం కట్టలు త్రెంచుకుంది.

"ఏంటిరా? తమాషాగా వుందా? పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యక వెళ్ళు" అరిచేడు రంగనాథరావు.

"ఎవడ్రా పిచ్చివేషాలేస్తున్నది? రెండు రూపాయిలిచ్చి కదులు!" మీద మీదకొచ్చేడు రిక్షావాడు.

ఇంతలో వీళ్ళ కేకలు విని, ఇరుగు పొరుగు వారంతా బయటికొచ్చేరు. రోడ్డు మీద పోతున్నవారు కూడా మూగి చోద్యం చూస్తున్నారు.

"నేనివ్వను! నీ బాబుతో చెప్పుకో" కోపంతో వూగిపోతూ అరిచేడు రంగనాథరావు.

"పోనీలెండి! ఆ రెండు రూపాయలు పారెయ్యండి. గొడవెందుకు?" భార్య రాధ రంగనాథరావు దగ్గరగా వెళ్ళి చెప్పింది.

అప్పటికే ఇరుగుపొరుగు వారంతా గుమికూడడంతో రాధ మొహం చిన్నబుచ్చుకుంది.

"ఇవ్వవా? రిక్షా ఎక్కేటప్పుడు నీ బాబు సొమ్ములా దర్జాగా ఎక్కి కూర్చున్నావు! ఈ పదీ కూడా నీకాడే వుంచుకో! పిసినారి యెదవా" పదినోటు రంగనాథరావు మొహం మీద విసిరేసి రిక్షా తీసుకుపోతుంటే, రంగనాథరావు "వెధవా అంటావురా చంపేస్తాను" రిక్షావాడి మీదకి పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. ఇరుగుపొరుగువారాపు చేసి, రంగనాథరావుని వెనక్కి లాగేసేరు. "ఎందుకు సార్ గొడవ? లోపలికి వెళ్ళిపోండి" అందరూ కలసి రంగనాథరావుని ఇంట్లోకి పంపించేసేరు. కానీ వెడుతూ వెడుతూ "వెధవ రెండు రూపాయిల కోసం.." అనుకుంటూ నవ్వుకుంటూ వెళ్ళిపోయేరు.

రంగనాథరావు కోపం చల్లారలేదు. "వెధవ! పది రూపాయలకు బేరమాడి.." చేతులు ఇంకా వణుకుతూనే వున్నాయి.

"మీరు ముందు ఇలా కూర్చోండి! కాఫీ ఇస్తాను. ఇంక ఆ గొడవ వదిలెయ్యండి బాబూ!" రాధ అనునయంగా అంది.

ఆ రాత్రంతా రంగనాథరావుకి నిద్ర పట్టలేదు. అందరిలో తనకెంత అవమానం జరిగింది! రిక్షావాడి మీద కసి ఇంకా తగ్గలేదు. వాడి రూపమే కళ్ళ ముందు వద్దన్నా కదులుతూనే వుంది.

"ఏమండీ! ఇంకా నిద్రపోలేదా? ఇంకా ఆ గొడవే ఆలోచిస్తున్నారా? ఇప్పుడు టైమెంత యిందో తెలుసా? నాలుగు గంటలు" రాధ భర్తకి దగ్గరగా జరుగుతూ ఆప్యాయంగా అంది.

"చూడండి! రెండు రూపాయలకోసం మీ మనశ్శాంతి రాత్రంతా ఎలా పోయిందో! మనశ్శాంతిని కొన్ని వేల రూపాయిలిచ్చినా కొనలేమండీ! అటువంటి వాళ్ళతో సమానంగా దెబ్బలాడి మనం గెలవలేము. వాళ్ళు దేనికైనా తెగిస్తారు. మనమే ఇంతవరకు పరిస్థితి రాకుండా ఆ రెండు రూపాయలు వాడి మొహాన కొట్టుంటే రాత్రంతా హాయిగా నిద్ర పోయేవాళ్ళము కదా! మనశ్శాంతి ఖరీదు వెలకట్టలేమండీ!"

"అవును రాధా! నువ్వు చెప్పింది అక్షరాలా నిజం! ఈ నగ్నసత్యాన్ని నువ్వింత సున్నితంగా చెప్పినందుకు థాంక్యూ!" తను చేసిన చిన్న పొరపాటుకి పశ్చాత్తాపపడుతూ చెప్పేడు రంగనాథరావు.

"అయితే ఇప్పుడేనా కాస్సేపు పడుకోండి హాయిగా! మళ్ళీ ఆఫీసుకెళ్ళాలిగా తొమ్మిది గంటలకే!" నవ్వుతూ దుప్పటి ముసుగేసేసింది రాధ.

**-బి.రాధాకృష్ణమూర్తి (విశాఖపట్నం)**